
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం । 9 । సెప్టెంబర్ । 2024



తిరిగొచ్చిన ఆర్టిజన్లు

సమ్మె చేసిన ఆర్టిజన్లను గత ప్రభుత్వం తొలగించడంతో పాటు కొందరిని బదిలీ చేయగా ఎట్టకేలకు వారంతా కేటీపీఎస్‌కు తిరిగొచ్చారు. 8లో



2.46 క్వింటాళ్ల గంజాయి సీజ్

ఏపీ నుంచి తరలిస్తున్న 2.46 క్వింటాళ్ల గంజాయిని జూలూరుపాడులో పోలీసులు పట్టుకుని, ఇద్దరిని అరెస్ట్ చేశారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
29° / 25°

జిల్లాలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్‌: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారికి ఆదివారం సువర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారికి పూజ చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్‌ : మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లికి అర్చకులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఒడి బియ్యం, పసుపు, కుంకుమ, చీరలు, గాజులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు గిరిజన దర్బార్‌

భద్రాచలంటౌన్‌: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్‌ నిర్వహిస్తున్నామని, అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ పీఓ బి. రాహుల్‌ సూచించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడదల చేశారు. గిరిజనలు తమ సమస్యలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేయాలని పేర్కొన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

సూపర్‌బజార్‌(కొత్తగూడెం): భారీ వర్షాల కారణంగా నేడు(సోమవారం) నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు దరఖాస్తులు అందజేయడానికి కలెక్టరేట్‌కు రావద్దని సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీ రోహిత్‌రాజ్‌

కొత్తగూడెంటౌన్‌: రాబోయే రెండు రోజులు భారీ వర్ష సూచన ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని ఎస్పీ రోహిత్‌రాజ్‌ కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు. వరదనీటితో ప్రమాదకరంగా ఉన్న రోడ్లు దాటే ప్రయత్నం చేయొద్దని పేర్కొన్నారు. వ్యవసాయ పనులకు, పశువులు మేపేందుకు కూడా అడవుల్లోకి వెళ్లొద్దని సూచించారు. ఆపదలో ఉన్న వారిని రక్షించేందుకు జిల్లా పోలీసులు ఎప్పుడూ అందుబాటులో ఉంటారని, ఈ మేరకు డీడీఆర్‌ఎఫ్‌ బృందాలను సిద్ధం చేశామని తెలిపారు. ఆపదలో ఉన్నవారు సహాయం కోసం డయల్‌ 100కు ఫోన్‌ చేయాలని కోరారు.

సింగరేణిలో అప్రెంటిస్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఏడాది కాలానికి అప్రెంటిస్‌ షిప్‌ కోసం నోటిఫికేషన్‌ విడుదలైంది. ఐటీఐ ఉత్తీర్ణులై నేషనల్‌ ట్రేడ్‌ సర్టిఫికెట్‌ కలిగిన వారు అర్హులని, ఇంటర్మీడియేట్‌ ఒకేషనల్‌ కోర్సు చేసిన వారు అర్హులు కాదని అధికారులు వెల్లడించారు. ఈనెల 9వ తేదీ నుండి 23వ తేదీ వరకు www.apprenticeshipindia.org లేదా www.scclmines.com/ apprentice ship ద్వారా దరఖాస్తు చేసుకుని సంబంధిత పత్రాలు, సర్టిఫికెట్లతో ఈనెల 10 నుండి ఆయా ఏరియాల ఎంవీటీసీ కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు. 80 శాతం సీట్లు సంస్థ ఉద్యోగులు, కార్మికుల పిల్ల లు, ప్రభావిత ప్రాంత నిరుద్యోగులకు కేటా యించగా మిగిలిన 20 శాతం తెలంగాణలోని ఆరు జిల్లాల్లో గల నిరుద్యోగ యువతకు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. రెండేళ్ల ఐటీఐ పూర్తిచేసిన వారికి నెలకు రూ.8,050, ఏడాది కోర్స్‌ చేసిన వారికి మస్టర్ల ఆధారంగా నెలకు రూ.7,700 చెల్లిస్తామని తెలిపారు.

ప్రతీ ఏడాది గోదావరికి తప్పని భారీ వరదలు

- చిగురుటాకులా వణికిపోతున్న ఏజెన్సీ
- ఫ్లడ్‌ మాన్యువల్‌తో తగ్గిన వరద కష్టాలు
- మైదాన ప్రాంతాలకూ తప్పని మెరుపు వరదలు

ఇటీవలి వరదలతో భద్రాచలం వద్ద ఉప్పొంగి ప్రవహిస్తున్న గోదావరి (ఫైల్‌)



వరద భయం.. గోదారి పారం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఒకప్పుడు వరద ముప్పు నదీ తీర ప్రాంతాల్లోనే ఎక్కువగా ఉండేది. కానీ సాగు విస్తీర్ణం పెరగడం, అడవులు, పొలం గట్ల వెంట చెట్ల సంఖ్య తగ్గడంతో చెరువులు, కుంటలు, వాగులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తూ పెను విపత్తుకు దారితీస్తున్నాయి. ఈ నేపథ్యంలో గోదావరి వరద మాన్యువల్‌ తరహాలోనే భారీ వర్షాలు పడినప్పుడు నష్ట తీవ్రత తగ్గించేలా సరికొత్త ప్రణాళిక అందుబాటులోకి తేవాల్సిన అవసరముంది.

గోదావరికి ఎనిమిదిసార్లు..

స్వాతంత్రం వచ్చిన తర్వాత గోదావరికి ఎనిమిది సార్లు భారీ వరదలు వచ్చాయి. ఇందులో 1953, 1986, 1991 వరదలు భద్రాచలం ఏజెన్సీని అతలాకుతలం చేశాయి. ముఖ్యంగా 1986 ఆగస్టులో ఏకంగా 76 అడుగుల ఎత్తులో గోదావరి ప్రవహించింది. దీంతో తిండి, తాగునీరు లేక ప్రజలు అలమటించారు. అప్పట్లో తహసీల్దార్ల ఆధ్వర్యంలోనే సహాయ కార్యక్రమాలు చేపట్టేవారు. వారికి గల పరిమిత అధికారాలతో సాయం కూడా అదే స్థాయిలో ఉండేది. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్‌.రాజశేఖరరెడ్డి హయాంలో 2006 ఆగస్టు 6న వచ్చిన భారీ వరదతో ఏజెన్సీ అతలాకుతలం అయింది. ఆ సమయంలో భద్రాచలంలో వైఎస్‌ స్వయంగా పర్యటించారు. అప్పుడు వరద సాయం పేరుతో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లోని లోపాలను గమనించారు. దీంతో గోదావరి వరదలు, సహాయ కార్యక్రమాలపై సరికొత్త ప్రణాళిక సిద్ధం చేయాలంటూ నాటి కలెక్టర్‌ శశిభూషణ్‌కు ఆదేశాలు జారీ చేశారు.

ఫ్లడ్‌ మాన్యువల్‌

పోలవరం ప్రాజెక్టు సర్వే కోసం శశిభూషణ్‌ జిల్లా ఏజెన్సీలో విస్తృతంగా పర్యటించడంతో స్థానిక పరిస్థితులపై అవగాహన ఏర్పడింది. దీంతో వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఫ్లడ్‌ మాన్యువల్‌ తయారు చేశారు. వరదలు రావడానికి ముందే ముంపు ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వీలుగా మరబోట్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచడం, ఎగువ ప్రాంతంలో నమోదయ్యే వర్షపాతం, వరదలకు తగ్గట్టుగా లోతట్టు ప్రాంతాల వారిని పునరావాస కేంద్రాలకు తరలించడం, సహాయ శిబిరాల్లో భోజనం అందించే పనిని స్థానికంగా ఉండే హోటల్‌ యజమానులు, ఆశ్రమ పాఠశాలలకు అప్పగించడం వంటి అంశాలకు ఫ్లడ్‌ మాన్యువల్‌లో చోటు కల్పించారు. గతంలో వరద సాయంలో పాల్గొనే హెలికాప్టర్లు హైదరాబాద్‌లో బయలుదేరితే గాలిలోనే చక్కర్లు కొడుతూ ఆహార పొట్లాలు అందించి తిరిగి వెళ్లేవి. హెలికాప్టర్లు దిగేందుకు ఏజెన్సీలో నాలుగుకో అర్డినేట్లను సిద్ధం చేశారు.

తగ్గిన నష్టం

తీరం వెంట ముంపు భయం ఉన్న గ్రామాలకు మంజూరయ్యే అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాల భవనాలను ఊరిలో కాకుండా సమీపంలోని ఎత్తయిన ప్రాంతంలో నిర్మించాలని నిర్ణయించారు. తద్వారా ఏడాది పొడవునా ఈ భవనాలు సంబంధిత సేవలు అందిస్తూనే, వరదలు వచ్చినప్పుడు అక్కడి ప్రజలకు ఆశ్రయం కల్పించే కేంద్రాలుగా మారాయి. కొత్త ఫ్లడ్‌ మాన్యువల్‌ 2007 అందుబాటులోకి వచ్చిన తర్వాత గత 17 ఏళ్లలో గోదావరికి క్రమం తప్పకుండా వరదలు వస్తున్నా.. దాని దుష్ప్రభావాలు గణనీయంగా తగ్గిపోయాయి. 2022 జూలై 14న ఏర్పడిన క్లౌడ్‌ బరస్ట్‌ కారణంగా గోదావరికి ఒకే రోజు 24 లక్షల క్యూసెక్కుల (71 అడుగులు ఎత్తు) వరద వచ్చినా భద్రాచలం ఏజెన్సీలో ఒక్క మరణం కూడా సంభవించలేదు. ఆస్తి నష్టం కూడా గతంలో పోల్చితే గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం భద్రాచలం దగ్గర 14 లక్షల క్యూసెక్కుల వరద (53 అడుగులు) వచ్చి మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేసినా ధీమాగా ఉండే పరిస్థితులు నెలకొన్నాయి.

మైదానాల్లో ఆకస్మిక వరదలు

కొండ ప్రాంతాల్లో మాత్రమే ఆకస్మిక వరదలు ఎక్కువగా వస్తుంటాయి. కానీ ఇప్పుడు మైదాన ప్రాంతాల్లోనూ ఈ తరహా వరదలు పెరుగుతున్నాయి. ఇటీవల అశ్వారావుపేట సమీపంలోని పెద్దవాగు, ఖమ్మం, మహబూబాబాద్‌ జిల్లాల్లో ఆకేరు, మున్నేరులను గంటల వ్యవధిలోనే ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. రాత్రి వేళ వరద ఒక్కసారిగా చుట్టుముట్టడంతో అనేక మందికి సురక్షిత ప్రాంతాలకు వెళ్లే అవకాశం లేకుండా పోతోంది. ఇంట్లో సామగ్రి సంగతి పక్కన పెడితే ప్రాణాలు దక్కితే చాలనే భయంకర స్థితి ఎదురైంది.

బ్లూ బుక్‌లో..

వరద నష్టాలను తగ్గించేందుకు బ్లూ బుక్‌ తయారు చేయాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ అంచనాలను దృష్టిలో ఉంచుకుని అత్యంత భారీ వర్షాలు పడే ప్రాంతాల్లో భౌగోళిక పరిస్థితుల ఆధారంగా వరద ముప్పు ఉన్న ప్రాంతాల ప్రజలను ముందుగా హెచ్చరించేలా మార్పులు తీసుకురావాలి. దీని కోసం అందుబాటులో ఉన్న కమ్యూనికేషన్‌ వ్యవస్థలను సమర్థంగా ఉపయోగించుకోవాలి. తీవ్ర ముప్పు ఉన్న ప్రాంతాల ప్రజల కోసం సహాయక శిబిరాల ఏర్పాటుకు చోటు కల్పించాలి. వీటితో పాటు వరద ముప్పు ఉన్న చోట వంతెనలపై రాకపోకలు నియంత్రించడం, వాగులు, చెరువుల వద్ద చేపలు పట్టుకునేవారు, పశువుల కాపర్లను అప్రమత్తం చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

గుండాల : సుభాష్‌నగర్‌ కాలనీలో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు



కొలువుదీరిన గణనాథుడు



భద్రాచలం అశోక్‌నగర్‌ కాలనీలో ఏర్పాటు చేసిన భారీ విగ్రహం

జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు శనివారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. వివిధ ఆకృతులతో కూడిన గణేశుడి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. మండపాలను విద్యుద్దీపాలు, మామిడి తోరణాలతో అలంకరించారు. గణపతికి తీరొక్క రకాల ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. రెండో రోజైన ఆదివారం పలుచోట్ల అన్నదానాలు చేశారు. కాగా, భద్రాచలం అశోక్‌నగర్‌ కాలనీలో భారీ గణనాథుడి విగ్రహాన్ని ముంబై నుంచి తెప్పించారు. సార్వజనిక గణపతి రూపం (లాల్‌ బాద్‌ షా రాజా) విగ్రహం ముంబైతో పాటు భద్రాచలంలోనే ఉందని మండలి నిర్వాహకులైన పవర్‌ బాయ్స్‌ అసోసియేషన్‌ బాధ్యులు తెలిపారు. ఈ విగ్రహం ఎత్తు 18 అడుగులు కాగా సుమారు రూ.2 లక్షలు వెచ్చించినట్లు చెప్పారు.

– భద్రాచలంటౌన్‌/నెట్‌వర్క్‌

వివరాలు 9లో

సింగరేణి నోటిఫికేషన్‌కు ఫైనల్‌ కీ విడుదల

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో 272 పోస్టుల భర్తీకి జూలై 20, 21 తేదీల్లో పరీక్ష నిర్వహించగా 12వేల మంది హాజరయ్యారు. ఆపై ప్రాథమిక కీ విడుదల చేసిన యాజమాన్యం అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం అనంతరం శనివారం ఫైనల్‌ కీ విడుదల చేసింది. అయితే, అక్రమాలు జరగకుండా చూడాలనే లక్ష్యంతో పరీక్షలకు సంబంధించి సమాచారం విషయంలో గోప్యత పాటిస్తున్న అధికారులు ఫైనల్‌ కీని అభ్యర్థులకు నేరుగా పంపించారు. ఈమేరకు వారం రోజుల్లో ఫలితాలు వెల్లడించే అవకాశముందని తెలిసింది.

నేటి నుంచి సింగరేణి క్రీడాపోటీలు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియం, అనుబంధ మైదానాల్లో ఈనెల 9వ తేదీ నుంచి 30వ తేదీ వరకు సింగరేణి కార్పొరేట్‌ ఏరియా స్పోర్ట్స్‌ అండ్‌ గేమ్స్‌ విభాగం ఆధ్వర్యాన క్రీడాపోటీలు జరగనున్నాయని జీఎం పర్సనల్‌ (వెల్ఫేర్‌ అండ్‌ ఆర్సీ) సామ్యేల్‌ సుధాకర్‌ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆసక్తి ఉన్న ఉద్యోగులు సంబంధిత విభాగం అధికారి అనుమతితో హాజరు కావాలని సూచించారు. ఇక్కడ పోటీల్లో విజేతలను రీజియన్‌, కంపెనీ స్థాయికి ఎంపిక చేస్తామని తెలిపారు.

రాజకీయాలకు అతీతంగా ఆదుకుంటాం...



ధంసలాపురంలో ఇళ్లు కోల్పోయిన వారిని పరామర్శిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు



వరద బాధితులకు సామగ్రి అందజేస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు కిషన్‌రెడ్డి, పొంగులేటి, ఎంపీ ఈటల, విశ్వేశ్వరరెడ్డి తదితరులు

- సామాజిక సంస్థలు సైతం ముందుకు రావాలి..
- త్వరలో నష్టం అంచనాలకు కేంద్ర బృందం పర్యటన
- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి
- మంత్రి పొంగులేటి, ఎంపీలతో కలిసి వరద ముంపు ప్రాంతాల్లో పరిశీలన

ఖమ్మంవన్‌టౌన్‌/ఖమ్మం మామిళ్లగూడెం: రాజకీయాలను పక్కనపెట్టిన రాష్ట్రంలోని వరద బాధితులను ఆదుకుంటామని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. జిల్లాలోని ఖమ్మం 16వ డివిజన్‌ ధంసలాపురంతో పాటు తిరుమలాయపాలెం మండలం రాకాసితండాలో వరద బాధితులను ఆదివారం ఆయన రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, చేవెళ్ల, మల్కాజ్‌గిరి ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్‌తో కలిసి పరామర్శించారు. ఢిల్లీ నుండి వచ్చిన ఆయనకు ఖమ్మం కలెక్టర్‌ ముజమ్మిల్‌ ఖాన్‌, సీపీ సునీల్‌ దత్‌, బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం ధంసలాపురం కాలనీకి చేరుకున్న మంత్రులు కిషన్‌రెడ్డి, పొంగులేటి, ఎంపీలు వరద బాధితులైన ముమ్మడి వెంకటనారాయణాచారి, షేక్‌ బుజ్జి, ఆశా సుల్తానా, ఎస్‌.కే.షరీఫ్‌, వేముల సమ్మక్కతో పాటు పలువురి ఇళ్లకు వెళ్లి నష్టం వివరాలు తెలుసుకుని ఓదార్చారు. ఆతర్వాత మున్నేరు వరద ఉధృతిని సమీపంలోని ఓ ఇంటి పైనుంచి పరిశీలించారు. అక్కడి నుంచి బయలుదేరి వెళ్తుండగా కాన్వాయ్‌కి ఎదురెళ్లిన పలువురు మహిళలు తమ పరిస్థితిని చెప్పుకుని కంటతడి పెట్టగా ఏ ఒక్కరూ అధైర్యపడొద్దని, అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. అనంతరం బీజేపీ ఆధ్వర్యాన వరద బాధితులకు నిత్యావసర సామగ్రి పంపిణీ చేశారు.

కనీవినీ ఎరగని వరద

ఈసందర్భంగా మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఖమ్మంలో మునుపెన్నడూ లేని రీతిలో వరద రావడంతో సర్వం కోల్పోయిన వారిని రాజకీయాలకు అతీతంగా ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రప్రభుత్వ సమన్వయంతో ఆదుకుంటామని తెలిపారు. త్వరలోనే కేంద్ర ప్రభుత్వ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వరద నష్టంపై అంచనా వేస్తారని చెప్పారు. అప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌డీఆర్‌ఎఫ్‌ నిధులతో సహాయక చర్యలు చేపట్టాలన్నారు. కేంద్రంలో కాంగ్రెస్‌ అధికారంలో ఉన్నప్పుడే విపత్తు సమయంలో ఇవ్వాల్సిన నిధులపై విధివిధానాలను రూపొందించిందని, అందుకు అనుగుణంగా నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వం డిజాస్టర్‌ మేనేజ్‌మెంట్‌ ఫండ్‌ను సైతం వాడుకోలేదనే సమాచారం ఉందని, కేంద్ర హోంశాఖ ఆధీనంలోని ఆ నిధులను తిరిగి ఇప్పించేందుకు కృషిచేస్తానన్నారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉన్న వేళ సామాజిక సంస్థలు కూడా ముందుకు రావాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు.

వెనకడుగు వేసేది లేదు..

విపత్తు సంభవించిన వేళ ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌ షా వెంటనే సీఎం రేవంత్‌రెడ్డికి ఫోన్‌ చేసి అప్రమత్తంగా ఉండాలని, ప్రజలను ఆదుకునేందుకు వెనకడుగు వేయొద్దని సూచించారని.. వారికి ప్రజల పక్షాన విపత్తు నిర్వహణ శాఖ మంత్రి మంత్రిగా కృతజ్ఞతలు చెబుతున్నానని పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ధనిక రాష్ట్రమని చెప్పకుండా యథార్థాన్ని వివరించి కేంద్రం నుండి నిధులు అడగడంలో భేషజాలకు పోవడం లేదని, కేంద్రంతో కలిసి పనిచేసేందుకు వెనక్కి తగ్గబోమని చెప్పారు. ఆనాడు ప్రధాని మోదీ వస్తే సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి కలిసి బడేభాయ్‌ అంటే ప్రతిపక్షాలు రాద్ధాంతం చేశాయని, ఇప్పుడు ఆ పార్టీ నేతలు రాజకీయ లబ్ధికి ప్రయత్నిస్తుండడం సరికాదన్నారు. ఇప్పటివరకు రూ.5,438కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు కేంద్రానికి నివేదిక పంపించామని, దీన్ని జాతీయ విపత్తుగా ప్రకటించి రాష్ట్రాన్ని అన్నివిధాలా ఆదుకోవాలని కోరారు. కాగా, ప్రభుత్వం ప్రకటించిన సాయం సోమవారం నుంచి ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, తాండ్ర వినోద్‌రావు, గల్లా సత్యనారాయణ, శ్యాంరాథోడ్‌, నున్నా రవి తదితరులు పాల్గొన్నారు.

కన్నీటి గాథలే..



మట్టి మేటలతో వాగును తలపిస్తున్న వరి పొలం

- భారీ వర్షాలతో పత్తి, వరి పంటలకు తీవ్ర నష్టం
- కోతకు గురైన భూములు
- పొలాల్లో ఇసుక, మట్టి మేటలు
- ఆదుకోవాలంటున్న అన్నదాతలు

బూర్గంపాడు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, వరదలు రైతుల వెన్ను విరుస్తున్నాయి. దెబ్బతిన్న పంటలతో ఎవరిని కదిలించినా కన్నీటి గాథలే వినిపిస్తున్నాయి. వేల రూపాయల పెట్టుబడి, శ్రమ నీటిపాలు కావడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. కోతకు గురైన భూములు పంటలను పూర్తిగా దెబ్బతీయగా.. ఇసుక, మట్టి మేటలతో కోలుకోలేని పరిస్థితి నెలకొంది.

జిల్లాలో ఈ ఏడాది సుమారు 1.80 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారు. ఎకరాకు రూ. 30వేల వరకు పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం పత్తి పూత, పిందె, కాత దశల్లో ఉంది. గత 10 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పత్తిచేలలో నీరు నిలిచి మొక్కలు నేలవాలాయి. మరికొన్ని చోట్ల వడలిపోతున్నాయి. అధిక వర్షాలకు పూత, పిందె రాలిపోతున్నాయి. పత్తికాయలు నల్లబడి కుళ్లిపోతున్నాయి. జిల్లాలో సుమారు 10 వేల ఎకరాల్లో పత్తి, ఏడువేల ఎకరాల్లో వరి పంటలకు నష్టం వాటిల్లింది. భారీ వర్షాలతో పత్తి చేలతో పాటు వరి పొలాలు కోతకు గురవుతున్నాయి. కొన్నిచోట్ల ఇసుక, మట్టి మేటలు వేశాయి. వాటి కింద పత్తి మొక్కలు పూడుకుపోగా, పొలాలు సైతం దెబ్బతిన్నాయి. ఇంకా వర్షాలు తగ్గకపోవడంతో పంటలు చేతికందే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతకు గురైన, ఇసుక, మట్టి మేటలు వేసిన భూముల్లో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునే అవకాశం కూడా లేదని అంటున్నారు.

నీట మునిగిన మోటార్లు..

పంట నష్టంతో పాటు వ్యవసాయ మోటార్లు సైతం నీట మునిగాయి. విద్యుత్‌ స్టార్టర్లు, పైపులు, వైర్లు వరదల్లో కొట్టుకుపోయాయి. ఇప్పటికే వేల రూపాయలు పెట్టుబడి పెట్టిన తమకు మోటార్లకు మరమ్మతులు చేయించడం తలకు మించిన భారం అవుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందిస్తే తప్ప తాము కోలుకునే పరిస్థితి లేదని వాపోతున్నారు.

సగం పంట దెబ్బతిన్నది



భారీ వర్షాలకు పత్తిపంట సగానికి పైగా దెబ్బతిన్నది. లోతట్టులోని పత్తి మొక్కలు వరదలో కొట్టుకుపోయాయి. మిగిలిన వాటికి పూత, పిందె రాలిపోతున్నాయి. ఇప్పటికే ఎకరానికి రూ. 30 వేల వరకు పెట్టుబడి పెట్టి పూర్తిగా నష్టపోయాం. ప్రభుత్వం తక్షణమే రైతులను ఆదుకోవాలి.

– యేరువ బ్రహ్మారెడ్డి, రెడ్డిపాలెం

ఐదెకరాల్లో పంట నష్టం



భారీ వర్షాలు, వరదలకు ఐదెకరాల్లో పంట నష్టం వాటిల్లింది. సుమారు రూ. లక్షన్నర వరకు నష్టపోయా. దెబ్బతిన్న పత్తి చేలో మరో పంట వేసుకునే వీలు లేకుండా భూమి కోతకు గురైంది. ప్రభుత్వం స్పందించి తమకు పరిహారం అందించాలని వేడుకుంటున్నాం.

– దుప్పటి రాజు, నాగినేనిప్రోలు

పంట నష్టం సర్వే జరుగుతోంది



భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాం. పంట నష్టం అంచనా వేసే కార్యక్రమం కొనసాగుతోంది. ఒకటి, రెండు రోజుల్లో వివరాలు నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం.

– బి తాతారావు, ఏడీఏ

మున్సిపల్‌ ఛైర్మన్‌కు అరుదైన అవకాశం



దమ్మాలపాటి వెంకటేశ్వరావు

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపాలిటీకి అరుదైన అవకాశం దక్కింది. ఈ నెల 9,10 తేదీల్లో హైదరాబాద్‌ ప్రజాభవన్‌లో జాతీయ 16వ ఆర్థిక సంఘం ప్రతినిధుల సమావేశం జరుగనుంది. ఫైనాన్స్‌ కమిషన్‌ చైర్మన్‌ డాక్టర్‌ అరవింద్‌ పంగారియా హాజరై స్థానిక సంస్థలకు కేటాయించే నిధుల సద్వినియోగంపై రాష్ట్రంలోని కొందరు ప్రజాప్రతినిధులతో చర్చించనున్నారు. ఇందుకు గాను ఇల్లెందు మున్సిపల్‌ చైర్మన్‌ దమ్మాలపాటి వెంకటేశ్వరావును కూడా ఆహ్వానించారు. ఈ మేరకు సీడీఎంఏ వీ.పీ.గౌతమ్‌ నుంచి డీవీకి లేఖ అందింది. రాష్ట్రం నుంచి మున్సిపల్‌ చైర్మన్లు, కార్పొరేషన్‌ మేయర్లు కలిపి 15 మందిని ఆహ్వానించగా, అందులో తాను కూడా ఉండడం సంతోషంగా ఉందని దమ్మాలపాటి తెలిపారు.

టీపీసీసీ చీఫ్‌ను సన్మానించిన మంత్రి తుమ్మల



పీసీసీ చీఫ్‌ను సన్మానిస్తున్న మంత్రి

ఖమ్మంవన్‌టౌన్‌: తెలంగాణ ప్రదేశ్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడిగా నియమితులైన బొమ్మ మహేష్‌కుమార్‌ గౌడ్‌ను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్‌లో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహేష్‌కుమార్‌ నేతృత్వాన పార్టీ మరింత ముందుకు సాగుతుందని తెలిపారు.

క్లుప్తంగా

నేడు అప్రెంటిస్ మేళా

సింగరేణి(కొత్తగూడెం): ఈ నెల 9న కొత్తగూడెంలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నారు. అన్ని ట్రేడ్‌లలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఉదయం 10 గంటలకు ఐటీఐలో హాజరు కావాల్సి ఉంది. ఆసక్తిగల, జిల్లాలోని అభ్యర్థులు www.apprenticeshipindia.org.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఐటీఐ ప్రిన్సిపాల్ తెలిపారు.

ఎన్‌కౌంటర్ ప్రాంతం పరిశీలన



ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

కరకగూడెం: ఈ నెల 5న మావోయిస్టులకు, పోలీసులకు మధ్య ఎన్‌కౌంటర్ జరిగిన మండలంలోని రఘునాథపాలెం, మోతె గ్రామాల పరిధిలోని దోనాల గుట్ట అటవీ ప్రాంతాన్ని దర్యాప్తు అధికారి, ములుగు జిల్లా ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ శనివారం పరిశీలించారు. గ్రేహౌండ్స్ బలగాలతో మాట్లాడి ఎన్‌కౌంటర్ జరిగిన తీరును తెలుసుకున్నారు. అంతకుముందు కరకగూడెం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఆయన వెంట ఏడూళ్లబయ్యారం ఎస్సై రాజ్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

వివాహిత అదృశ్యం

బూర్గంపాడు: వివాహిత అదృశ్యంపై బూర్గంపాడు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పాత సారపాకకు చెందిన షా్య గుప్తా ఐటీసీ పీఎస్‌పీడీలో పనిచేస్తున్న శంకర్‌ను 13 ఏళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి ఇద్దరు కుమార్తెలు. భద్రాచలంలోని ఓ ఆటో షోరూమ్‌లో పనిచేస్తున్న ఆమె శనివారం విధులకు అని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు పలుచోట్ల వాకబు చేసిన ఆచూకీ దొరకలేదు. వివాహిత సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రెండు బైక్‌లు చోరీ

దమ్మపేట: రెండు బైక్‌ల చోరీపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. దమ్మపేట గ్రామానికి చెందిన ఎస్‌కే యూసుఫ్ తన బైక్‌ను గత జూలై 22న రాత్రి తన ఇంటి ముందు పార్క్ చేసి ఉంచగా, చోరీ చేశారు. దమ్మపేటకే చెందిన కొండపల్లి పుల్లారావు అనే వ్యక్తి జూలై 2న తన బైక్‌ను ప్రభుత్వాస్పత్రి సమీపంలోని సాహో దాబా ముందు పార్క్ చేసి ఉంచగా, గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటనలపై బాధితులు ఆదివారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

అంత్యక్రియలకు ఇక్కట్లు



మృతదేహంతో బురదలో నుంచి వెళ్తున్న బంధువులు

వైరా: ఎడతెరిపి లేని వర్షాలు, రహదారులపై బురదతో అంత్యక్రియలకు సైతం ఇక్కట్లు ఎదురవుతున్నాయి. వైరా మున్సిపాలిటీ పరిధిలోని 1, 2వ వార్డుల్లో వర్షాకాలం వచ్చిందంటే ఈ సమస్య సర్వసాధారణమవుతోంది. రెండో వార్డుకు చెందిన పల్లపు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందగా, ఆయన మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళ్లేందుకు కుటుంబీకులు, బంధువులు పడిన బాధలు అంతా ఇంతా కావు. ఓ వైపు వర్షం, మరోవైపు రిజర్వాయర్‌కు ఆనుకుని ఉన్న శ్మశానవాటికలోకి నీరు చేరడంతో అవస్థ పడ్డారు. బురదలో నుంచే శ్మశానానికి చేరుకుని అంత్యక్రియలు పూర్తిచేశారు.

ఆర్టీసీ బస్సు - ట్యాంకర్ ఢీ, తప్పిన ప్రమాదం



ఘటనా స్థలిలో ఆర్టీసీ బస్సు, ట్యాంకర్

ఏన్కూరు: ఆయిల్ ట్యాంకర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టగా తృటిలో ప్రమాదం తప్పింది. భద్రాచలం నుంచి ఖమ్మం వెళ్తున్న ఆర్టీసీ బస్సు మార్గమధ్యలో ఏన్కూరు మండలం గార్లఒడ్డు వద్ద రోడ్డు పక్కన నిలిపిన యాష్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయమై బస్సుడ్రైవర్ రమేశ్ మాట్లాడుతూ.. ఎదురుగా రెండు కార్లు వసుండటంతో బ్రేక్ వేసి పక్కకు తప్పించే క్రమాన రోడ్డు పక్కన ఆగిన లారీని ఢీకొట్టినట్లు తెలిపారు. కాగా, ఘటనపై పోలీసులకు ఎవరూ ఫిర్యాదు చేయలేదు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,392

కేటీపీఎస్‌కు తిరిగొచ్చిన ఆర్టిజన్లు

- సమస్యల పరిష్కారం కోసం గతేడాది ఏప్రిల్‌లో సమ్మె
- ఎస్మా ప్రయోగించి 197మంది కార్మికుల సస్పెన్షన్, మరికొందరి బదిలీ
- 15 నెలలపాటు ఆర్థికంగా ఇబ్బందులు పడ్డ కుటుంబాలు
- తిరిగి వారిని సొంత స్థానాల్లోకి తీసుకున్న ప్రభుత్వం



కేటీపీఎస్ 7వ దశ సీఈ నుంచి జాయినింగ్ ఆర్డర్లు తీసుకుంటున్న ఆర్టిజన్ కార్మికులు

పాల్వంచ: ఆర్టిజన్ల సమస్యల పరిష్కారం కోసం సమ్మె బాట పట్టడంతో అప్పటి ప్రభుత్వం ఎస్మా చట్టం ప్రయోగించి తొలగించిన కార్మికులతోపాటు, బదిలీ చేసిన కార్మికులు ఎట్టకేలకు వారి సొంత స్థానాలకు వచ్చారు. విద్యుత్ సంస్థల్లో పనిచేసే ఉద్యోగులతో పాటు ఆర్టిజన్లకు 51 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని, ఏపీఎస్‌ఈబీ సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, బ్రిటీష్ స్టాండింగ్ ఆర్డర్లు రద్దు చేయాలని, విద్యార్హత ఆధారంగా ఓఅండ్ఎం ఉద్యోగిగా కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేస్తూ గతేడాది ఏప్రిల్ 26వ తేదీ నుంచి టీఎస్ జెన్‌కోతో పాటు ఎన్‌పీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్ సంస్థలకు చెందిన ఆర్టిజన్ కార్మికులు సమ్మె చేపట్టారు. ఈ క్రమంలో 144 సెక్షన్ అమలు చేసి యాజమాన్యాలు సమ్మెను విచ్ఛిన్నం చేశాయి. గైర్హాజరైతే విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించి.. సమ్మెకు వెళ్లిన 197 మందిని విధుల్లో నుంచి తొలగించాయి. 13 మందిపై బదిలీ వేటు వేశాయి.

దూర ప్రాంతాలకు బదిలీ

కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నవారిని 2018లో ప్రభుత్వం ఏకకాలంలో 23వేల మందిని ఆర్టిజన్లుగా తీసుకుంది. కానీ వారికి సరైన సౌకర్యాలు, జీతభత్యాలు లేకపోవడంతో ఆందోళన చెందారు. దీంతో సమస్యల పరిష్కారానికి పోరుబాట పట్టగా, యాజమాన్యాలు కఠినంగా వ్యవహరించాయి. బదిలీ చేస్తామని, ఉద్యోగాల నుంచి తొలగిస్తామంటూ బెదిరింపులకు దిగాయి. ఈ క్రమంలో సమ్మెకు పిలుపునివ్వగా.. అప్పటి వరకు సపోర్ట్ ఇచ్చిన కార్మికులు సైతం ఎక్కడ ఉద్యోగాలు పోతాయో ఆందోళనతో విధుల్లోకి వెళ్లారు. కానీ ఉద్యోగాలు లెక్క చేయక కార్మిక శ్రేయస్సే లక్ష్యంగా పనిచేసిన కొందరు నాయకులు, కార్మికులపై చర్యలు తీసుకున్నారు. విధుల నుంచి తొలగించడంతోపాటు సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారు. దీంతో వారి బాధలు వర్ణనాతీతంగా మారాయి. కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడగా, దూర ప్రాంతాల్లో విధులు నిర్వహించలేక నరకయాతన అనుభవించారు.

సీఈ నుంచి జాయినింగ్ ఆర్డర్లు..

విధుల్లో నుంచి తొలగించిన కార్మికులను అనేక విజ్ఞప్తుల నేపథ్యంలో 53 రోజుల తర్వాత షరతులతో తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకున్నారు. వారితో పాటు వివిధ ప్రాంతాలకు బదిలీ అయిన కీలక నేతలు 13 మందిని 15 నెలల తర్వాత గతంలో వారు పనిచేసిన స్థానాలకే బదిలీలు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఇందుకు ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఎంతో కృషి చేశారు. ఈ సందర్భంగా బదిలీపై మళ్లీ యథాస్థానాలకు వచ్చిన కార్మికులు శనివారం స్థానిక సీఈ పి.వెంకటేశ్వరరావును కలిసి జాయినింగ్ ఆర్డర్లను అందుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణా విద్యుత్ కార్మిక సంఘం (హెచ్-82) రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల కృష్ణా రెడ్డి, జయరాజ్‌లు సహకరించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, యూనియన్ గౌరవ అధ్యక్షుడు ప్రొఫెసర్ హరగోపాల్, నాయకుడు సీతారామి రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆటోలు కొట్టుకుపోయి.. ఉపాధి కోల్పోయి..

- ఆవేదన వ్యక్తం చేస్తున్న ఆటోడ్రైవర్లు
- సబ్సిడీపై ప్రభుత్వం కొత్త ఆటోలు ఇవ్వాలని విన్నపం



ఇసుకవాగులో కూరుకుపోయిన ఆటో

అశ్వాపురం: వరదలతో ఆటోలు కొట్టుకుపోయి డ్రైవర్లు ఉపాధి కోల్పోయారు. ఇటీవల భారీ వర్షాలు, వరదలకు మండల పరిధిలోని గొందిగూడెం గ్రామం వద్ద ఇసుక వాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో వరదలో 9 ఆటోలు కొట్టుకుపోయాయి. వాటిలో ఏడు దొరకగా, అందులో ఉదయ్‌భాస్కర్ అనే వ్యక్తి ఆటో పూర్తిగా పాడై పోయింది. మిగతావి మరమ్మతులకు గురయ్యాయి. కలిబోయిన సందీప్, కాగితాల పుల్లారెడ్డిలకు చెందిన మరో రెండు ఆటోలు దొరకకపోవడంతో బాధితులు గాలింపు చేపట్టారు. ఆదివారం పుల్లారెడ్డి ఆటో ఇసుకలో కూరుకుపోయి ఉండగా గుర్తించారు. పూర్తిగా పాడైందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. సందీప్‌నకు సంబంధించిన ఆటో ఇంకా దొరకలేదు. ఒక్కొక్కరికి రూ.1.50 లక్షల చొప్పున నష్టం వాటిల్లిందని బాధితులు ఉదయ్, సందీప్, పుల్లారెడ్డి తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆటోలు లేక ఉపాధి కోల్పోయామని పేర్కొంటున్నారు. కలెక్టర్ ఎమ్మెల్యే, తహసీల్దార్ తమ బాధ ఆలకించి న్యాయం చేయాలని, సబ్సిడీపై ఆటోలు అందజేసి తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నారు.

2.46 క్వింటాళ్ల గంజాయి సీజ్

ఇద్దరు అరెస్ట్, కారు, బైక్ స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్

జూలూరుపాడు: అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. కొత్తగూడెం డీఎస్పీ ఎస్కే అబ్దుల్ రెహమాన్ కథనం ప్రకారం.. కొత్తగూడెం వైపు నుంచి ఖమ్మం వైపు ఇన్నోవా కారులో గంజాయి తరలిస్తున్నారనే సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్, జూలూరుపాడు పోలీసులు మండల కేంద్రంలో నిఘా పెట్టారు. ఈ క్రమంలో తొలుత బైక్‌పై వస్తున్న వ్యక్తిని అనుమానంతో అదుపులోకి తీసుకున్నారు. కొంతసేపటికి వస్తున్న ఇన్నోవా కారులో గంజాయి ప్యాకెట్లను నలుపు రంగు మ్యాగ్నెట్ షేడ్ మ్యాట్‌లతో కవర్ చేసి తీసుకెళ్తున్నారు. తనిఖీ చేపట్టిన పోలీసులు 2.46 క్వింటాళ్ల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బైక్‌పై వస్తున్న వ్యక్తితోపాటు కారు డ్రైవర్‌ను కూడా అరెస్ట్ చేశారు. నిందితులను విచారించగా సీలేరు నుంచి గంజాయి తీసుకుని సారపాక వచ్చి మూడు రోజులు ఉన్నట్లు తేలింది. ఆదివారం ఉదయం సారపాక నుంచి హైదరాబాద్ వెళ్తుండగా పట్టుబడ్డారు. నిందితులు బూర్గంపాడు మండలం సారపాక తాళ్లగొమ్మూరు, మజీద్‌రోడ్ ప్రాంతాలకు చెందిన దుగ్గింపుడి శివశంకర్ రెడ్డి, నాగేంద్రబాబులుగా గుర్తించారు. వీరిపై గతంలో పలు పోలీసు స్టేషన్లలో గంజాయి కేసులు నమోదు కావడంతోపాటు జైలు జీవితం కూడా గడిపారు. కారు, బైక్, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రమాకాంత్, ఎస్‌ఐ ప్రవీణ్, జూలూరుపాడు ఎస్‌ఐ రాణా ప్రతాప్‌లకు రివార్డులు ఇవ్వనున్నట్లు డీఎస్పీ తెలిపారు. సీఐలు ఇంద్రసేనా రెడ్డి, రమాకాంత్, ఎస్‌ఐలు రాణా ప్రతాప్, ప్రవీణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుట్కా ప్యాకెట్లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యనారాయణ

ఇల్లెందురూరల్: మండలంలోని కొమ్ముగూడెం క్రాస్‌రోడ్డు వద్ద ఆదివారం పోలీసులు గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ఇల్లెందు-మహబూబాబాద్ ప్రధాన రహదారిపై కొమ్ముగూడెం క్రాస్‌రోడ్డు వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో లచ్చగూడెం గ్రామానికి చెందిన రేపాకుల చిన్న వెంకటేశ్వర్లు ఆటోలో మూడు బ్యాగుల్లో గుట్కా ప్యాకెట్లు తరలిస్తుండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న గుట్కా ప్యాకెట్ల విలువ రూ. 48 వేలు ఉంటుందని అంచనా. నిందితుడిపై కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేసినట్లు ఇల్లెందు సీఐ బత్తుల సత్యనారాయణ తెలిపారు.

విద్యార్థి చికిత్సకు రూ.1.57 లక్షల సాయం



నాగరాజు తల్లిదండ్రులకు నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఏన్కూరు: కష్టాల్లో ఉన్న విద్యార్థుల కోసం పూర్వ విద్యార్థులు ఆపన్నహస్తం అందిస్తూ ఔదార్యం చాటుకుంటున్నారు. ఏన్కూరుకు చెందిన మేనుగు నాగరాజు స్థానిక గురుకుల పాఠశాలలో చదివి ప్రస్తుతం హైదరాబాద్‌లోని ప్రైవేట్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆయన హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. నాగరాజు తల్లిదండ్రులు కూలి పనులు చేస్తున్నట్లు తెలుసుకున్న గురుకులం పూర్వ విద్యార్థులు స్పందించారు. ఆదిలాబాద్‌లో ఉద్యానశాఖ అధికారిగా పనిచేస్తున్న గుడిమళ్ల సందీప్‌కుమార్ ఆధ్వర్యాన రూ.1.57 లక్షలు సేకరించి హైదరాబాద్‌లో నాగరాజు చికిత్స కోసం ఆయన తల్లిదండ్రులు శ్రీనివాసరావు, విజయకు శనివారం అందించారు.

వైద్యం వికటించి బాలుడు మృతి

కొణిజర్ల: ఓ ప్రైవేట్ వైద్యుడు చేసిన చికిత్స వికటించి బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని సింగరాయపాలెం (అల్లీపురం)లో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, బాలుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చిర్రా నరసింహారావు - రాజ్యలక్ష్మి ఏకైక కుమారుడు సాయి(13) నాలుగు రోజులుగా జ్వరంతో బాధ పడుతున్నాడు. దీంతో గ్రామంలోని ఓ ప్రైవేట్ వైద్యుడు చికిత్స చేస్తూ క్యాన్‌లా పెట్టి శనివారం ఇంజక్షన్ చేశాడు. ఆ తర్వాత కాసేపటికే బాలుడు నురగలు కక్కుతూ కనుమూశాడు. దీనికి వైద్యం వికటించడమే కారణమని బంధువులు ఆరోపిస్తూ కన్నీరుమున్నీరయ్యారు. కాగా, చాలా గ్రామాల్లో ఆర్‌ఎంపీలు, పీఎంపీలు అర్హతకు మించి వైద్యం చేస్తూ దోచుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అయితే, బాలుడి మృతి నేపథ్యాన గ్రామపెద్దలు సదరు వైద్యుడితో చర్చిస్తున్నట్లు తెలిసింది.

లభ్యంకాని రమణారెడ్డి ఆచూకీ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం వద్ద శుక్రవారం వంతెనపై నుంచి గోదావరి నదిలోకి దూకిన పోలీస్ కానిస్టేబుల్ శీలం నాగరమణారెడ్డి ఆచూకీ ఇంతవరకు దొరకలేదు. 48 గంటలుగా గజ ఈతగాళ్ల సహాయంతో బోటు ద్వారా భద్రాచలం టౌన్ పోలీసులు, రమణారెడ్డి కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కూనవరం వరకు గాలించారు. ఆదివారం ఉదయం నుంచి భద్రాచలంలో వర్షం కురుస్తుండటంతో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.

ఆబోతును కాపాడిన గ్రామస్తులు



వాగులో కొట్టుకుపోతున్న ఆబోతు

టేకులపల్లి: మండలంలో ఆదివారం భారీ వర్షం కురవడంతో పాతతండా-రాంపురం మధ్యలో ప్రవహిస్తున్న రాళ్లవాగు ఉప్పొంగింది. రాంపురం గ్రామానికి చెందిన ఆబోతు ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు దాటేందుకు ప్రయత్నించి కొట్టుకుపోయింది. గమనించిన గ్రామస్తులు బాదావత్ వీరన్న, తేజావత్ చిన్న, కోటి, విజయ్, సంతోష్, హోమ్‌గార్డు జి.వీరయ్యలు కొట్టుకుపోతున్న ఆబోతును కాపాడారు.

రేషన్ బియ్యం పట్టివేత

పాల్వంచ: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. పట్టణంలోని అల్లూరి సెంటర్ ఏరియాలో ఓ రేకుల షెడ్డులో అక్రమంగా నిల్వ చేసిన 66 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు. నిందితుడు జర్పుల శ్రీనుపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చండ్రుగొండ: మండలంలోని తిప్పనపల్లి గ్రామం వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఖమ్మం జిల్లా కల్లూరుకు చెందిన ఇనుముల నాగేశ్వరరావు, రాము వరుసకు అన్నదమ్ములు. ఇద్దరు కుల దేవతకు మొక్కులు చెల్లించేందుకు మేకపోతు కోసం చండ్రుగొండ మండలంలోని రేపల్లెవాడ గ్రామానికి ద్విచక్రవాహనంపై వచ్చారు. మేకపోతును తీసుకుని వెళ్తుండగా తిప్పనపల్లి గ్రామం వద్ద జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న సింగరేణి సంస్థకు చెందిన బొలెరో వాహనం ఢీకొట్టింది. దీంతో అన్నదమ్ములిద్దరికీ గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను 108 వాహనంలో కొత్తగూడెం తరలించారు. నాగేశ్వరరావును మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

దుమ్ముగూడెం : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న కుసిని సందీప్ (36) ఆదివారం మృతి చెందాడు. ఎస్‌ఐ గణేష్ కథనం ప్రకారం.. గంగోలు గ్రామానికి చెందిన కుసిని సందీప్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 3వ తేదీ రాత్రి సమయంలో ఆటో నడుపుకుంటూ గంగోలు నుంచి భద్రాచలం వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో భద్రాచలం నుంచి దుమ్ముగూడెం వైపు మరో ఆటో వస్తోంది. ఈ క్రమంలో రేగుబల్లి గ్రామంలో వెంకటేశ్వర స్వామిగుడి సమీపంలో రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొని బోల్తాపడ్డాయి. దీంతో సందీప్‌కు తీవ్రగాయాలు కాగా, కుటుంబ సభ్యులు చికిత్స హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన, లక్ష్మీనగరం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కటుకూరి చంద్రమౌళిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య లావణ్య, ఇద్దరు పిల్లలున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు..



నాగకార్తీక్‌రెడ్డి (ఫైల్)

ఎర్రుపాలెం: మండలంలోని నారాయణపురానికి చెందిన ఇంటర్ విద్యార్థి నరెడ్ల నాగకార్తీక్‌రెడ్డి (17) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఆయన శనివారం సాయంత్రం తమ కోళ్లఫామ్ షెడ్‌కు వెళ్లాడు. అక్కడ లైట్లు వేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై ఘటనాస్థలంలో మృతి చెందాడు. ఘటనపై కార్తీక్‌రెడ్డి తండ్రి నాగమల్లేశ్వరరెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. కాగా, వినాయక చవితి పర్వదినాన ఈ ప్రమాదం జరగడంతో విషాదం అలుముకుంది.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్ : మండలంలోని కిన్నెరసానిలో పర్యాటకులు సందడి చేశారు. శనివారం వినాయక చవితి, ఆదివారం రెండు రోజుల సెలవు కలిసి రావడంతో జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి పర్యాటకులు పెద్దసంఖ్యలో వచ్చారు. డ్యామ్ వద్ద నుంచి జలాశయం, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించడమేకాక జలాశయంలో బోటు షికారు చేశారు. కిన్నెరసానిలోకి 249 మంది పర్యాటకులు ప్రవేశించడం ద్వారా వైల్డ్ లైఫ్ శాఖ రూ.9,515, 60 మంది బోటుషికారు చేయడంతో టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.3,580 ఆదాయం లభించింది.

రెండు గేట్లు ఎత్తివేత

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కిన్నెరసాని జలాశయానికి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఆదివారం నీటిమట్టం 405.20 అడుగులకు పెరగగా రెండు గేట్లు ఎత్తి 6వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేశారు.

ఐదు పంచాయతీలు కలపాలని దీక్ష



దీక్ష చేస్తున్న ఓయూ విద్యార్థి జేఏసీ నాయకులు

భద్రాచలంటౌన్: ఆంధ్రలో విలీనమైన ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపాలని కోరుతూ ఓయూ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఆదివారం దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం శ్రీరామ్ మాట్లాడుతూ గతంలో రెండు రాష్ట్ర ప్రభుత్వాల చర్చల్లో ఐదు పంచాయతీలను తెలంగాణకు ఇచ్చేందుకు సూత్రప్రాయంగా అంగీకారం జరిగినా పార్లమెంటు స్థాయిలో ఇంతవరకు ఎలాంటి కార్యచరణ జరగలేదన్నారు. మొదటి నుంచి సహకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య, మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు తక్షణమే కార్యచరణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారంలోకి వస్తే ఐదు పంచాయతీల సమస్యను పరిశీలిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ మాట నిలుపుకోవాలని, భద్రాచలాన్ని పోలవరం ముంపు నుంచి కాపాడాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమం నక్క రత్నకుమారి, నక్క శాంతకుమార్, నాగళ్ల పద్మ, గోపి జంపన్న, సాంబ, భాష, పోశయ్య, కందుకూరి విజయలక్ష్మి, వరలమ్మ, రమేష్, బిక్షం, ఆవులూరి సత్యనారాయణ, చల్లగుళ్ల నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ గొప్పతనాన్ని చాటేందుకే 'అపూర్వ' సమ్మేళనం



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు

ఖమ్మంసహకారనగర్: ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీబీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో చదివిన వేలాది మంది ఉన్నత స్థాయికి చేరారని.. ఈ గొప్పతనాన్ని నలుమూలలా చాటేందుకే పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించినట్లు వక్తలు పేర్కొన్నారు. కళాశాలలో ఆదివారం సయ్యద్ ఇబ్రహీం ఆధ్వర్యాన పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించగా తొలుత భూమి విరాళ దాత గెంటేల నారాయణరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత మరణించిన ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులకు నివాళిగా మౌనం పాటించారు. అనంతరం అధ్యక్షత వహించిన కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు నల్లమోతు తిరుమల్‌రావు మాట్లాడుతూ.. ఈ సమ్మేళనం నిర్వహణ కోసం ఏడాదిగా కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన ఢిల్లీ ఇగ్నో ప్రొఫెసర్ ఎంఎస్ సీనంరాజు మాట్లాడుతూ.. కళాశాలకు ఎంతో చరిత్ర ఉందన్నారు. కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం పాటు పడాలని కోరారు. ప్రధాన కార్యదర్శి వీరెల్లి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లా కోర్టు, ఐటీ హబ్ తరలించే పక్షంలో ఆ భవనాలు కళాశాలకు కేటాయించాలని కోరారు. హైకోర్టు న్యాయవాది కడారు ప్రభాకర్‌రావు, భరత్ విద్యాసంస్థల అధిపతి శీలం వెంకటరెడ్డి, ఎస్.మణిభూషణాచారి మాట్లాడగా పూజారి గణశంకర్ రూపొందించిన డాక్యుమెంటరీతో పాటు అఖండ జ్ఞానజ్యోతి గెంటేల నారాయణరావు, చదువులమ్మ ఒడిలో జ్ఞాపకాలం పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, బిచ్చాల తిరుమల్‌రావు, నాళ్ల భానుచందర్, గోపిశెట్టి వెంకటేశ్వరరావు, మల్లం రమేశ్, పుల్లయ్య, జాన్, గోపిచంద్, దీకొండ చంద్రకళ, మదార్ తదితరులు పాల్గొన్నారు.

19.5 అడుగులకు చేరిన వైరా రిజర్వాయర్



13వ వార్డులో రహదారిపైకి చేరిన వర్షపు నీరు

వైరా: వైరాలోని రిజర్వాయర్ నీటి మట్టం రెండు రోజుల్లోనే 19.5 అడుగులకు చేరింది. పూర్తిస్థాయి నీటిమట్టం 18.3 అడుగులు కాగా, అంతకు మించి నీరు చేరడంతో ఐదు అలుగుల ద్వారా సుమారు 7 వేల క్యూసెక్కుల వరద వైరా నది ద్వారా కృష్ణా నదిలోకి వెళ్తోంది. జలవనరుల శాఖ డీఈ శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్‌ఐ వంశీకృష్ణ రిజర్వాయర్, లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. రాజీవన్‌నగర్, ఇందిరమ్మ కాలనీ నుంచి 40 కుటుంబాలను వైరా జెడ్పీఎస్ఎస్ బాలికల ఉన్నత పాఠశాలలోని పునరావాస కేంద్రానికి తరలించారు. అక్కడ వారికి భోజన వసతి కల్పించడంతో పాటు అవసరమైన సరుకులు అందజేశారు.